క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

మానకొండూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సోమవారం తనిఖీ చేశారు. సమ్మెటివ్ పరీక్షలు జరిగే రోజుల్లో కూడా విద్యార్థులు రెండు పూటలు పాఠశాలకు హాజరు కావాలన్నారు. తప్పనిసరిగా యూనిఫాం, షూ వేసుకుని పాఠశాలకు రావాలని సూచించారు. ఒకపూట విద్యార్థులను చదివించి, మరోపూట పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని, చూసి రాయడానికి అవకాశం ఇవ్వకూడదని ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీల్లో హెచ్‌ఎం శ్రీనివాస్, తదితరులున్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న విజయభాస్కర్,తదితరులు

చొప్పదండి: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ భాస్కర్ కోరారు. పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, మత్తుపదార్థాలతో జీవితం నాశనమవుతుందని వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కరస్పాండెంట్ రత్నాకర్‌రెడ్డి, కవిత, పరివర్తన, మాలతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే హంగామా..



నృత్యం చేస్తున్న విద్యార్థిని

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఈసీఈ ప్రథమ సంవత్సర విద్యార్థుల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా ఉన్నతంగా ఎదిగేందుకు ఆలోచన చేయాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కళాశాలలో అన్నిరకాల సదుపాయాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవా లన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఈసీఈ, విభాగాధిపతి డాక్టర్ రమేశ్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. మల్లయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఏజెంట్లు

జమ్మికుంట: ఆల్ ఇండియా ఎల్ఐఏఎఫ్ఐ (లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఇండియా) పిలుపు మేరకు పట్టణంలోని ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయం ఎదుట ఏజెంట్లు సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కొత్త పాలసీలకు పాత పద్ధతిలో కమీషన్ ఇవ్వాలని, పాలసీదారులకు బోనస్ పెంచాలన్నారు. పాలసీ ప్రీమియం తగ్గించాలని, లక్ష ఎస్ఏ పాలసీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పంజాల ప్రభాకర్, సంపత్‌రావు, సమ్మయ్య, ఎగ్గెటి కుమారస్వామి, శ్రీనివాస్, సమ్మారావు, నాగేశ్, రాంబాబు, రాజు, తిరుపతి పాల్గొన్నారు.

అలయ్ బలయ్ విజయవంతం

తిమ్మాపూర్: మండలంలోని కొత్తపల్లిలో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ నేతల అలయ్ బలయ్ కార్యక్రమం విజయవంతమైందని పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ తెలిపారు. ఇందుకు సహకరించిన పార్టీ గ్రామ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, సింగిల్‌విండో చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులకు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. ఐక్యతతో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడాలని కోరారు.

'పది'లో రాణించాలి

వీణవంక: రాబోయే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని, మంచి ఫలితాలు సాధించేందుకు కష్టపడాలని మండల విద్యాధికారి శోభారాణి అన్నారు. మండలంలోని ఘన్ముక్కుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం షూ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిరోజు విద్యార్థులు యూనిఫాం, షూ ధరించి స్కూల్‌కు రావాలని సూచించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు తిరుపతి, రాజశేఖర్‌రెడ్డి, పాపిరెడ్డి, తదితరులున్నారు.

నాలుగేళ్లుగా రైతులకు నష్టం

- మిడ్‌మానేరు కెనాల్‌కు ఏటా గండి
- పంటపొలాల్లో ఇసుకమేటలు
- నామమాత్రపు చర్యలు చేపడుతున్న అధికారులు
- పట్టించుకోవడం లేదని రైతుల ఆరోపణలు



రేకొండ గ్రామం వద్ద తెగిన మిడ్‌మానేరు కుడికాలువ



పొలాల వద్దకు వెళ్లకుండా తెగిన కట్ట

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామం మీదుగా బొమ్మనపల్లి, దుద్దెనపల్లి, సైదాపూర్ ద్వారా ఆకునూర్ నుంచి రాయికల్ వరకు వెళ్తున్న సాగునీటి కాలువ కట్ట ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయింది. దీంతో కాలువ కింద ఉన్న వరిపొలాల్లో ఇసుకమేటలు పెట్టడంతో పాటు వరదలకు వరి కొట్టుకుపోయింది. దాదాపు 100 మంది రైతులకు చెందిన 450 ఎకరాల్లోని వరి పంటకు నష్టం వాటిల్లింది. చిగురుమామిడి నుంచి బొమ్మనపల్లి వరకు ఏటా వర్షాకాలంలో కెనాల్‌కు గండిపడుతోంది. అధికారులు నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా రైతులు నాలుగేళ్లుగా నష్టపోతూనే ఉన్నారు.

రైతులకు నష్టం

2019 నుంచి మిడ్‌మానేరు కుడికాల్వ ద్వారా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు సాగునీరు అందుతోంది. భారీ వర్షాలకు రేకొండ–బొమ్మనపల్లి గ్రామాల మధ్య కెనాల్‌కు గండిపడుతోంది. రేకొండ వెంకటాద్రి కుంట వద్ద వర్షపునీరు భారీగా గ్రామ ఊర చెరువులోకి వెళ్తోంది. కెనాల్ తవ్విన నాటి నుంచి నేటివరకు వర్షపు నీరు వెళ్లేందుకు ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేయలేదు. దీంతో వరదనీరు కెనాల్‌పై చెరువులోకి వెళ్తోంది. ఫలితంగా గండిపడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

చిగురుమామిడి, పీచుపల్లి, చిన్నముల్కనూర్, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల మధ్య నాలుగేళ్లుగా కెనాల్‌కు గండిపడుతోంది. రెండుసార్లు బొమ్మనపల్లి ఎల్లమ్మ టెంపుల్ వద్ద కెనాల్‌కు గండిపడి వరద నీరు రాయినిచెరువులోకి ప్రవహించింది. బొమ్మనపల్లి ఊరచెరువు, దామరబోయినకుంటలోని వరద నీరు భారీగా కెనాల్‌లోకి చేరడంతో గండిపడుతోంది. గండి పడిన ప్రదేశం వద్ద ఉన్న పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో పంటలకు సాగునీరు అందని పరిస్థితి ఎదురవుతోంది. అధికారులు పైనుంచి కెనాల్, కింది నుంచి వర్షపునీరు చెరువులోకి వెళ్లేందుకు సూపర్‌పాస్ ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చిన్నముల్కనూర్ గ్రామశివారులో కెనాల్‌పై నుంచి వరదనీరు పొంగి ప్రవహిస్తుండగా తక్షణమే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ట్రాక్టర్ల ద్వారా మట్టి పోయడంతో ప్రమాదం తప్పింది. ఏటా ఇదే విధంగా అవుతుందని సంబంధిత ఇరిగేషన్‌శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

సూపర్‌పాస్ ఏర్పాటు చేయాలి

చిగురుమామిడి నుంచి చిన్నముల్కనూర్, పీచుపల్లి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామం వరకు కెనాల్‌కు గండిపడుతున్న చోట సూపర్‌పాస్ ఏర్పాటు చేయాలి. చెరువులోకి వచ్చే వరదనీరు, కెనాల్‌కు సంబంధంలేకుండా ఏర్పాటు చేస్తే రైతులకు నష్టం వాటిల్లదు. లేకపోతే ఏటా కెనాల్‌తో ప్రమాదం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా శాశ్వత ప్రణాళికలు రూపొందించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నష్టం జరుగుతోంది



నాలుగు సంవత్సరాలుగా భారీ వర్షాలకు కెనాల్ కట్ట తెగిపోయి తీవ్రనష్టం జరుగుతోంది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. శాశ్వత మరమ్మతు చర్యలు తీసుకోకపోవడంతో పొలంలో వేసిన వరి కొట్టుకుపోతోంది. కనీసం పెట్టుబడి కూడా రావడంలేదు.

– అరిగెల రమేశ్, రైతు, రేకొండ

అధికారులు స్పందించాలి



కెనాల్ ఏటా నష్టపరుస్తూనే ఉంది. పైనుంచి చెరువులోకి వచ్చే వరదను ఇంజినీరింగ్ అ ధికారులు ఎస్టిమేట్ వేయలేకపోతున్నారు. భారీ వరదలకు నీరు కెనాల్‌లోకి చేరి కట్ట తెగిపోతోంది. ఏటా రైతులందరం అధికారులకు మొరపెట్టుకుంటున్నాం. ఇప్పటికైనా స్పందించి రైతులకు నష్టం కలగకుండా చూడాలి.

– అరిగెల ధర్మయ్య, రైతు, రేకొండ

ప్రతిపాదనలు పంపాం

మూడేళ్లుగా అదనపు బడ్జెట్ కోసం ప్రతిపాదనలు చేశాం. ఇందుర్తి నుంచి బొమ్మకల్ వరకు కెనాల్ ఉంది. సిమెంట్ పనులు చేస్తే 49 వేల ఎకరాలు సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉంది. డిసెంబర్ నెలాఖర్‌లో నీరు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. అండర్ టన్నెల్, ఇతర పనులు, 35 కి.మీ నుంచి 75 కి.మీ వరకు కెనాల్‌కు మరమ్మతు చేయాల్సి ఉంది.

– సదయ్య, డీఈఈ ఎంఎంఆర్ కెనాల్, చిగురుమామిడి

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



గుండ్లపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి

గన్నేరువరం: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి, గునుకులకొండాపూర్ గ్రామాల్లో ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ అమలవుతుందన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గుండ్లపల్లిలో మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన నాటుకోళ్ల మదర్ యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామీణ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి, ఉన్నతిలో భాగంగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, తహసీల్దార్ నరేందర్, ఏవో కిరణ్మయి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఎం లావణ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ కోటి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి సునీల్, ఏఎంసీ డైరెక్టర్లు మౌనిక, కనుకయ్య, అనిల్, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

27న జగిత్యాలలో మాదిగల ధర్మయుద్ధ జిల్లా మహాసభ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

హుజూరాబాద్‌రూరల్: జగిత్యాల జిల్లాలో 27న నిర్వహించ తలపెట్టిన మాదిగల ధర్మయుద్ధ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను దేశంలో మొదట తెలంగాణలో అమలు చేస్తామని అవసరమైతే ఆర్డినెన్సు తెచ్చి ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం మాట తప్పారని, మాలల ఒత్తిడికి తలొగ్గి మిగతా ఉద్యోగాలను భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని నిరసిస్తూ నిర్వహించే మహాసభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు వసంత్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి, జాతీయ ఉపాధ్యక్షుడు రామచంద్రం, సీనియర్ నాయకుడు సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మధునయ్య, హుజూరాబాద్, వీణవంక మండలాల అధ్యక్షులు రాజ్ కుమార్, అరుణ్, సీనియర్ నాయకులు రవితేజ, రాకేశ్, రక్షిత్, చేతన్, కుమార్ పాల్గొన్నారు.

హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

జమ్మికుంట: హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని టీహెచ్‌డబ్ల్యూ (తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం, కార్యదర్శి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో టీహెచ్‌డబ్ల్యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జంగ సంపత్ అధ్యక్షతన ఆదివారం జిల్లా మహాసభ సమావేశం నిర్వహించారు. కార్మిక చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలో ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి ఉండాలన్నారు. వలస కార్మికులతో స్థానికులకు ఉపాధి దొరకడం లేదని, ప్రభుత్వ రంగ సంస్థ గోదాములు ఎస్‌డబ్ల్యూసీ, సీడబ్ల్యూసీ, వేర్‌హౌజ్‌ల్లో పనిచేసే కార్మికులకు యాజమానులు పీఎఫ్ చెల్లించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాధ్యులు మోహన్, ఉపాధ్యక్షుడు మధు, కరీంనగర్ రైల్వే హమాలీ అధ్యక్షుడు లచ్చన్న, పెద్దపల్లి జీఎంఆర్ గోదాం చిప్పరాజు, ఏఎంసీ గట్టయ్య, సతీష్, శ్రీశైలం, రాజు, సౌత్ సెంట్రల్ రైల్వే కార్మిక సంఘం అధ్యక్షుడు యాదవరెడ్డి, భరత్, రాజేశేఖర్, వివిధ జిల్లాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి కరీంనగర్ రీజియన్ ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ కమిషనర్ తానయ్య, లేబర్ కమిషనర్ అధికారులు కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్‌పై అవగాహన కల్పించారు.

రోడ్డును పరిశీలించిన అధికారులు



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి స్టేజీ నుంచి అన్నారం వరకూ సుమారు నాలుగు కిలోమీటర్లు మేర రోడ్డు అధ్వానంగా తయారైంది. తారురోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి రూ.4.84 కోట్లు మంజూరు కాగా పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ రవి ప్రసాద్, స్పెషల్ ఏఈ ప్రవీణ్ సోమవారం రోడ్డును పరిశీలించారు. ఊర చెరువు నీరు గ్రామంలోని పంచాయతీ ముందు నుంచి వెళ్తుండటంతో గ్రామంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, కాంగ్రెస్ నాయకులు మీస సత్యనారాయణ, చెలికాని సదయ్య వివరించారు. మత్తడి నీటితో ఇబ్బందులు పడకుండా నిర్మాణం చేపడుతామని అధికారులు తెలిపారు. చెరువు మత్తడి, జీపీ ముందున్న ఒర్రెను పరిశీలించారు. రహదారి వెంట బావులు, కల్వర్టులు, లోలెవల్ వంతెనలను పరిశీలించామని, టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు మొదలవుతాయని అధికారులు తెలిపారు.

నియామకం

సైదాపూర్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా వస్తాదుల సదానందంను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి సోమవారం ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా సిరంశెట్టి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శిగా గడ్డం స్వామిని నియమించామన్నారు. నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు అండగా ఉంటా..


రామడుగు: నిరుద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ప్రచార నిర్వహించారు. పట్టభద్రుల సంక్షేమం కోసం తన వంతు బాధ్యతగా పనిచేస్తానని ఓటేసి మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తవుటు మురళి, మామిడి తిరుపతి, మాజీ సర్పంచ్ పంజాల జగన్మోహన్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన కల్లెం చిరంజీవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబ సభ్యులకు రూ.ఐదువేలు అందజేశారు. పిల్లలు మల్యాల గురుకుల పాఠశాలలో చదువుకోడానికి సీటు కల్పించారు. చిన్నారులను ఆదుకున్నందుకు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

గంగాధర: గంగాధరకు చెందిన మడ్లపల్లి ప్రణయ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన కుటుంబానికి మల్లాపూర్ గ్రామానికి చెందిన తూడి లచ్చన్న రూ.పదివేలు అందించారు.

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కంది తిరుపతిరెడ్డి



తిరుపతిరెడ్డి

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరికి చెందిన కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, అక్కన్నపేట మండలానికి చెందిన జంగాపెల్లి ఐలయ్య వైస్‌చైర్మన్‌గా నియామకమయ్యారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో చైర్మన్‌గా ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా, సుందరగిరిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, వార్డు సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు.



శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో రాత్రివేళ శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో రోడ్డుపైకి చేరి బైక్‌లపై వెళ్లేవారి వెంటపడుతున్నాయి. పలువురు గాయాలపాలవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. వ్యవసాయపనులకు వెళ్లిన రైతులు రాత్రి ఇంటికి వస్తుంటే శునకాలు వెంటబడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మాధవరావు, ప్రత్యేక అధికారి, కన్నాపూర్, సెల్ నం : 9121213247

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9393557752



చొప్పదండి: రక్తదానం చేస్తున్న ఎస్సై అనూష



మానకొండూర్: పోలీసులు, నాయకుల నివాళి

పోలీసు అమరవీరుల దినోత్సవం

చొప్పదండి: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సేవ్ ద లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తం సేకరించారు. ఫౌండర్ ముప్పిడి రాజ్‌కుమార్, సివిల్ ఆసుపత్రి డాక్టర్ ఉషారాణి, సీఐ ప్రకాశ్, ఎస్ఐ అనూష, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీసులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వర్గీయ ఉండింటి సంజీవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. సీఐ లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ జెడ్పీటీసీ శేఖర్ గౌడ్, మడుపు శ్యాంసుందర్, మడుపు ప్రేమ్‌కుమార్, గొశెట్టి సత్యనారాయణ తదితరులున్నారు.

గంగాధర: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. స్టేషన్ ఎదుట గంగాధరకు చెందిన గుజ్జేటి మహేశ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా మహేశ్ కుటుంబ సభ్యులను ఎస్సై నరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది సన్మానించారు.

ప్రజావాణి వినతులు

దారి ఆక్రమణపై ఫిర్యాదు

చొప్పదండి: పట్టణంలోని వివేకానంద చౌరస్తా సమీపంలో వందఅడుగుల రోడ్డు పక్కన పురాతన నక్ష దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణకు గురైన దారిని వెలికితీసి ప్రయాణికులకు అనుకూలంగా మార్చాలని కోరుతూ సమ్మక్క, సారలమ్మ ఉత్సవ నిర్వాహకుల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. సుమారు పదిహేడు గుంటల వరకు దారి ఆక్రమించారని, ప్రస్తుతం శివకేశవాలయానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారికి ఆక్రమణదారులు అడ్డువస్తున్నారని వాపోయారు. సర్వే చేసి దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పెద్దమ్మ దేవాలయం తొలగించనున్నారు, మరోచోట ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని ముదిరాజ్‌లు ప్రజావాణిలో విన్నవించారు. విగ్రహాలకు పరిహారం అందించాలని, స్థలం కేటాయించాలని అధికారులను కోరినట్లు ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు ఎడ్ల తిరుపతి పిట్టల సమ్మయ్య, పప్పు రాజు, సంపత్ తెలిపారు.

'దళితబంధు' నిధులు విడుదల చేయాలి

జమ్మికుంట: దళితబంధు రెండో విడుత నిధులు విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజక వర్గంలోని 200 మంది ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పది నెలలుగా ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని, రెండో విడుత నిధులపై స్పష్టమైన ఆదేశాలు వచ్చే విధంగా చూడాలని కలెక్టకు వినతిపత్రం అందించామని నాయకులు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రమేశ్

చిగురుమామిడి: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.రమేశ్ కోరారు. ఎంపీడీఓ ఖాజామొయినొద్దీన్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటరమణారెడ్డితో కలిసి ఐకేపీ, సింగిల్‌విండోల ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలను చిగురుమామిడి, ఇందుర్తి, సుందరగిరి గ్రామాల్లో సోమవారం ప్రారంభించారు. ఎంపీఓ రమ్యశ్రీ, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఏపీఎం సంపత్, సింగిల్‌విండో డైరెక్టర్లు లక్ష్మి, తిరుపతి, స్వామి, రాజయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

ఆరుగురికి జరిమానా

శంకరపట్నం: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి రూ.వెయ్యి చొప్పున హుజూరాబాద్ న్యాయమూర్తి ఈశ్వరయ్య జరిమానా వేశారని కేశవపట్నం ఎస్సై రవి తెలిపారు. ఆరుగురిని సోమవారం హుజూరాబాద్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి జరిమానా వేశారని పేర్కొన్నారు.

ఎల్లమ్మగుడిలో చోరీ

గన్నేరువరం: మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామం ఎల్లమ్మగుడిలో చోరీ జరిగింది. ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపిన వివరాలు... గుడిలో దొంగలు పడి వెండి ఆభరణాలు, హుండీలోని నగదు ఎత్తుకెళ్లారని, ఆలయ అధ్యక్షుడు న్యాలపట్ల పర్శరాం ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై కేసు

వీణవంక: వ్యవసాయ భూమి విషయంలో ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు. ప్రకాశ్‌రెడ్డి, అరుణకు చెందిన 7.19 ఎకరాల భూమిని మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన మ్యాక రమేశ్ రూ.71.50 లక్షలకు కొనుగోలు చేశాడు. డబ్బులు ముట్టిన తర్వాత 5.32 ఎకరాల భూమి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారని, మిగతా భూమి పట్టా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తూ చంపుతామని బెదిరిస్తున్నారని రమేశ్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

అదృశ్యం కేసు నమోదు

జమ్మికుంట: మానసికస్థితి సరిగా లేని వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి సోమవారం తెలిపారు. మండలంలోని శాయంపేటకు చెందిన రాచపల్లి సంపత్ శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: శాలపల్లి–ఇందిరానగర్‌లో బస్సు ఆపకుండా వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ప్రయాణికులు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. బస్సు ఆపకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందని, ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.